

హితశ్రీ

కిందటి సంవత్సరం డ్రీమ్ లాండ్ హోటల్లో జరిగిన సంఘటన జీవితంలో మర్చిపోలేను. ఆ సంఘటన నా జీవితాన్ని ఏవిధంగా ప్రభావితం చేసిందో చెప్పలేనుగాని, అందులో నాకూ కొంత సంబంధం ఉండటంవల్ల, ఒక ప్రత్యక్షానుభవం స్మృతిలో మెదిలినప్పుడల్లా కలిగే రసభావం నా కా సంఘటనవల్ల అనుభవైకవేద్యమై హృదయం ఆర్ద్రమౌతుంది. అందుకే ఇది మీకు చెప్తున్నాను.

ఆ హోటల్లో ఒకటో నెంబరు గదిలో నేను బసచేశాను. లాడ్జి మేడమీద. కింది భాగంలో కాఫీ, బోర్డింగ్. గదులు రెండు ఎదు రెదురు వరుసలలో ఇరవైదాకా ఉన్నాయి. నడవ అంత విశాలమైంది కాదు. మెట్లదగ్గిర రూములు లేకుండా వరండా ఏర్పాటుచేశారు. వరండా రైలింగ్ దగ్గిర నుంచుంటే కిందిభాగం వీధిదాకా కన్పిస్తుంది.

నేను బసచేసిన రూమ్ ఎదురుగా పదకొండో నంబరు రూమ్ ఉంది. పొద్దున్నే నిద్రలేచి టూత్‌బ్రష్ పట్టుకుని నడవ మీదుగా జనరల్ బాత్‌రూమ్‌కి వెడుతుంటే, ఒక యువతి మెట్లెక్కి వస్తోంది. యథాలాపంగా చూస్తే మళ్ళీ ఒకసారి చూడాలనిపించేఆకర్షణీయమైనవిగ్రహం. అందమైన వదనం. కుతూహలంకొద్దీ ఆమె ఏ గదిలో బసచేయబోతోందో చూశాను. పదకొండో నంబరు గదికి హోటల్ బాయ్ దారితీశాడు. అంటే ఒకటో నంబరు గదికి సరిగా ఎదురుగావున్న రూమ్. ఆమె చేతిలో చిన్న లెదర్ సూట్‌కేస్ ఉంది. ఖరీదైన చీర, జాకెట్ ధరించింది. ఆమె హైద్రాబాద్ వచ్చిన పనేమిటా అని మనసులో ప్రశ్న ఉదయించినా, అంతగా ఆ విషయం ఆలోచించకుండా నేను ముందుకి సాగిపోయాను. తిరిగి వస్తుంటే "ఏమండోయ్, మిమ్మల్నే" అనే పిలుపు విని వెనక్కి తిరిగాను. పధ్నాలుగో నంబరు గదిలోంచి ఒక వ్యక్తి పిలుస్తున్నాడు. పరిచయస్థుడే. మా ఊళ్ళో కంట్రాక్టరు సీతయ్య.

"పని మీద వచ్చినట్టున్నారే హైద్రాబాద్ ?" అన్నాడు.

"మరేనండీ. పనిమీదే. క్షేమమా ?" అన్నాను.

"ఆ. మీ చలవవల్ల. ఏం, పనేమిటి ?"

"ఏముందీ.అనంతపురంనించి శ్రీకాకుళానికి గిరవాటేశారు. ఆ విషయం ఏదో ప్రయత్నిద్దామని వచ్చాను."

"అలాగా ? తెలిసినవాళ్ళున్నారా?"

నేను తలూపాను.

"లేకపోతే నా వెంట రండి. సెక్రెటేరియట్‌లో నే నెంత చెపితే అంతే. సెక్రెటరీ దగ్గిర్నించి యు.డి.సి. దాకా నా మాట కాదనరు. మీకు తెలుసుగా." అన్నాడు ఆ కంట్రాక్టరు రొమ్ము విరుచుకుని. అతని పరోపకారబుద్ధికి కొంత సంతోషించినా, ఆ చెప్పే తీరు నాకు నచ్చలేదు. అతనివల్ల నాకు కావలసిన కార్యాన్ని సాధించుకునే బదులు వైఫల్యమే మే లనిపించింది.

"థాంక్స్. అక్కర్లేదులెండి. పనవుతుందని నాకు నమ్మకముంది." అని నా గదికేసి బయల్దేరాను. పాపం, అతను కొద్దిగా చిన్నబోయి మారు మాట్లాడకుండా అలాగే నిలబడి పోయాడు.

గదిలో నేను దుస్తులు మార్చుకుంటుంటే సంభాషణ వినిపించింది.

"ఏయ్ బాయ్, అవతల ఆమె అలా అరగంటనించీ పిలుస్తుంటే వినపట్టంలా. ఏం, నిద్రపోతున్నావా ?"

కంట్రాక్టరు తీవ్రస్వరం.

"వస్తున్నా సార్."

కిటికీలోంచి చూశాను. బాయ్ పదకొండో నంబరు గది దగ్గిరికి పరిగెత్తుకు వస్తున్నాడు. గది గుమ్మం దగ్గిర ఆమె నుంచుని ఉంది. కొంచెం దూరంలో కంట్రాక్టరు నిలబడి దర్జా వెలిగిస్తున్నాడు.

'ఏం కావాలమ్మా ?' బాయ్ అడిగాడు.

"కాఫీ." ఆమె నెమ్మదిగా ఆర్డరిచ్చింది.

"ఏంపనివాళ్ళో. ఎబ్బెబ్బె. ఒట్టి సోమరిపోతులండీ. వీళ్ళతో ఏం పను లవుతాయి. అన్నట్టు మం దేఊరండీ ?"

కంట్రాక్టరు చొరవగా ఆమెతో బాతాఖానీ వేస్తున్నాడు. ఆమె ఏదో జవాబు చెప్పింది. నాకు వినిపించలేదు.

"ఏం పనిమీద వచ్చారు ?"

ఆమె ఏదో చెప్పింది.

"ఓ, అలాగా. మీ పేరూ, ఆ ఉద్యోగం ఇచ్చే డిపార్ట్‌మెంటూ నాకు కాగితం మీద రాసివ్వండి. క్షణంలో పనవుతుంది. ఈ రోజుల్లో ఇన్‌ఫ్లుయెన్స్ లేంది ఏం పన్లవుతాయండీ! సెక్రెటరీ నాకు తెలిసినవాడే లెండి. ఏదో మనిషికి మనిషి సాయం. ఇంటర్వ్యూ నామ్‌కేవాస్తే. నాతో రండి.



సెక్రెటరీతో మాట్లాడదాం. ఏదో తెలిసిన వాళ్ళంటే సరిపోతుందిగాని....”

తను ఆ హోటల్లో బస చెయ్యటం కేవలం ఇతరులకి సేవ చేయటానికే అన్నట్లు అతడు మాట్లాడసాగాడు. ఆ దూకుడు చూసి నేను కొంత ఆశ్చర్యపోయాను. వెంటనే నాకో అనుమానమూ కలిగింది. అతను కొంత వయసు మళ్ళిన వాడే అయినా ఏ మాత్రం నీతీ నిజాయితీ లేని వాడని అందరికీ తెలిసిన రహస్యం. అసహాయురాలుగా కన్పిస్తోందని ఆమెని బుట్టలో వేయటానికి ఇతనేం పన్నుగడ పన్నటం లేదుగద! వెంటనే నాకో విషయం తట్టింది. ఇందాక నాతో అతను దర్పంగా మాట్లాడుతున్నప్పుడు ఆమె గది గుమ్మంలోనే ఉంది. ఆమెకి వినపడాలనే

అతనలా గొప్పలు చెప్పుకున్నాడా! ఎందుకైనా మంచిది, ఆమెని హెచ్చరించాలి. కాని ఆమె తన అక్కర్లేని జోక్యాన్ని ఏవిధంగా తీసుకుంటుందో!

తల దువ్వుకుని బయటికి వచ్చాను. వాళ్ళక్కడే నిలబడి ఉన్నారు.

"ఏమండీ, అలా కాఫీ త్రాగి వద్దాం, వస్తారా" అన్నాను.

అతను కొంచెం తటపటాయించి, "పదండి" అని నాతో అని, ఆమెవైపు చూసి "మళ్ళీ కనిపిస్తానండీ" అని ముందుకి సాగాడు.

"ఆమె ఎవరండీ?" అన్నాను.

"ఎవరో, ఉద్యోగానికి దరఖాస్తు చేసిందట. సొగసైన కనుముక్కు తీరు. ఎవడైతే మాత్రం ఉద్యోగం ఇవ్వక చస్తాడా!" అని నవ్వాడు.

"మీ రేదో సహాయం చేస్తా నన్నట్టున్నారు!"

"ఏం, మీకే ఆ అవకాశం ఇవ్వమన్నా రేమిటి?"

అతని ధోరణి వెగటు కలిగించింది. నేను ముఖం చిట్లించుకున్నాను. అది గమనించి "ఊరికే అన్నా లెండి, అంత ఇదవుతారేం?" అన్నాడు అతను. అయినా నేను మాట్లాడలేదు. కాఫీ ముగించాము. అతను బజారు పనిమీద బయటికి వెళ్ళాడు. నేను మళ్ళీ గదికి బయల్దేరాను. ఒక క్షణం ఆమె గదిముందు ఆగాను. కంట్రాక్టరు సీతయ్య పద్ధతి అదోకవిధంగా ఉండటం వల్ల ఆమెతో ఆవిషయం చెప్పా లని గట్టిగా అనిపించింది. కాని ఆమెని పిలవటానికి సాహసం కలగలేదు. అయినా ఇంకా టైం ఉందికదా అని నెమ్మదిగా గదిలోకి వెళ్ళి పేపరు చదువుతూ కూర్చుండిపోయాను.

కొంతసేపటికి 'సార్' అనే పిలుపు విని తల పైకెత్తాను. బాయ్ గుమ్మందగ్గిర నిలబడిఉన్నాడు.

"ఆ అమ్మగారు మిమ్మల్ని పిలుస్తున్నారండీ!" ఎదురు గదివైపు వేలుచూపిస్తూ అతను చెప్పాడు.

నాకు కొంత ఆశ్చర్యం కలిగింది. బహుశా ఆమె తన సహాయం కోరటానికి పిలిచి ఉంటుం దనుకొని వెంటనే లేచి వెళ్లాను. ఆమె గుమ్మం దగ్గిరే నిలబడింది. నన్ను చూడగానే నమస్కరించింది. కొంచెం సిగ్గుతో గది తలుపుకి వేసి ఉన్న కర్టెన్ని కొంత చాటు చేసుకుని దర్వాజా వారగా ఒదిగి నుంచుంది. ఒక్కసారి ఆమె కళ్లలోకి చూశాను. ఆ సోగకళ్లలో నల్లటి కంటిపాపలు ఎంతో అందంగా ఆకర్షణీయంగా ఉన్నా, వాటిలో ఉండవలసిన తళుకు కొంత లోపించినట్టుగా అనుభూతి కలిగింది.

"ఏమండీ, ఏం కావాలి?" అన్నాను.

ఆమె కొంచెం ఆగి నెమ్మదిగా, కొంత ప్రాధేయపూర్వకంగా అంది,

"ఇక్కడ సెక్రటేరియట్లో స్టెనో టైపిస్ట్ టెంపరరీపోస్టుకి నాకు ఇంటర్వ్యూ వచ్చిందండి. ఒక పెద్దమనిషి దగ్గిర్నించి టెస్టిమోనియల్ కావాలట. హడావిడిగా రావటంవల్ల వెంట తేవటం మర్చిపోయాను."

ఆమె ఆగింది. అంటే నన్ను టెస్టిమోనియల్ ఇవ్వమని అడుగుతోందన్న మాట.

"నే నిస్తే పనికొస్తుందా?" అన్నాను.

"తప్పకుండా. నా పేరు మాలతి. ఇదిగో ఇంటర్వ్యూ కాగితం. దయచేసి టెస్టిమోనియల్ ఇస్తే కృతజ్ఞురాలిని."

"దాని కేముండి. అలాగే. ఉద్యోగం వస్తుం దనుకుంటున్నారా?"

"ఇందాక సీతయ్యగా రని ఒకరు రికమెండ్ చేస్తా మన్నారు."

అదను దొరికిం దని సంతోషించాను.

"ఒకరిమీద ఆధారపడకండి. అందులో ముక్కూ మొహం తెలియనివాళ్ళ మాట మీద ఆశ పెట్టుకోకూడదు."

"ఆయన మిమ్మల్ని తెలు సన్నా రే? ఇందాక మీరూ పలకరించారుకదూ?"

చిక్కులో పడ్డాను.

"తెలియటాని కేంలెండి. సరే. మీకు చెప్పాలిసిన వాడిని కాదు. అసిస్టెంట్ సెక్రెటరీ ఒకరు నాకు తెలుసు. ఆయన చెవిని వేస్తాను. ఉపకారం జరిగితే జరగవచ్చు."

"థాంక్స్."

"నో మెన్షన్. సిటీ మీకు కొత్త. కొంచెం జాగ్రత్తగా ఉండండి. వస్తా."


ఇంతకంటె ఆమెకి హెచ్చరిక ఇవ్వ లేకపోయాను. గదిలోకి వచ్చి టెస్టిమోనియల్ రాసి ఆమెకి బాయ్‌చేత పంపాను.

పదిన్నరయింది. భోజనం చేసివద్దామని బయల్దేరాను. ఎదురుగా బోయ్ క్యారియర్ పట్టుకుని వస్తున్నాడు, ఆమెకోసం కాబోలు. ఆమె కేమైనా కావాలేమో కనుక్కుందా మని ఒక అడుగు ఆ గది వైపు వేశాను. కాని నా చొరవ ఆమె అపార్థం చేసుకుంటుందేమోనని ఆ ప్రయత్నం విరమించాను. బోయ్ క్యారియర్ ఆమె గదిలో పెట్టాడు. అతను తిరిగి వస్తుంటే అతని చేతిలో అయిదు రూపాయిల కాగితం కనిపించింది.

"చిల్లర కావాలా?" అన్నాను అప్రయత్నంగా.

అతను తలూపి "ఆ అమ్మగారికి కావాలంట బాబూ" అన్నాడు. ఆ నోటు యాంత్రికంగా తీసుకున్నాను. అది కాస్త నలిగి ఉంది. అతని చేతిలో నాలుగు రూపాయనోట్లూ, ఒక రూపాయిచిల్లరా పెట్టి, "బోయ్! ఈ నోటు నలిగింది. చెల్లుతుందో, చెల్లదో ఆమెచేత సంతకం పెట్టించుకు రా, చెల్లకపోతే వాపసు ఇద్దాం" అన్నాను.

బోయ్ క్షణంలో తిరిగివచ్చాడు. అతని చేతిలోని నోటు అందుకుని చూశాను. ఆమె సంతకం చేసింది. వెంటనే ఆమె దగ్గరికి వెళ్ళాను.




"ఐతే నీకు నత్తి ఎప్పుడూ వస్తూంటుందా ?"
"ర...ర...ర...ర...రాదండి. మ్...మా...మ...మ...మ్మాట్లాడే టప్పుడే ఒ...ఒ...ఒ...ఒస్తుందండి".

"ఏమండీ, ఇలా అమాయకంగా సంతకాలు పెట్టేస్తే పుట్టి మునుగుతుందండోయ్" అన్నాను నవ్వుతూ.

ఆమె తెల్లబోయి చూసింది.

"ఈ ప్రపంచంలో ఎన్నో కుతంత్రాలు జరుగుతున్నాయి. కొంచెం జాగ్రత్తగా ఉండండి. ఒంటరివారు కనుక చెబుతున్నాను. ఈ సంతకాన్ని దుర్వినియోగం చెయ్యటానికి ఎంతైనా అవకాశ ముంది.''

ఆమె కిదేమీ అర్థమైనట్టు లేదు.

"ఇకనించీ అలా సంతకం పెట్టనులెండి," అంది నవ్వు తెచ్చుకుంటూ.

''మీరు ఆఫీసుకి ఎన్నిగంటలకి వెళ్ళాలి ?''

''పదకొండున్నరకి."

"అవసరమైతే చెప్పండి, నేనూ వస్తాను."

"పరవాలేదండి మీకు శ్రమ; అవసరం'' అందామె.

"శ్రమేం లేదు. ఆఫీసుకి పోవలసిన అవసరం నాకూ ఉంది."

''నేను వెళ్ళగలనండీ" అని తిరిగి అందామె.

ఇక బలవంతం అనవసరం అనుకుని నేను 'సరే' నని భోజనానికి వెళ్ళాను. ఆమె సంతకంచేసి ఇచ్చిన ఐదురూపాయిల నోటుని భద్రంగా జేబులో పెట్టుకున్నాను. ఆమె అంటే ఎందుకో ఒక విధమైన అభిమానం ఏర్పడ్డది. ఆ నోటు ఖర్చుపెట్ట కూడదని అప్పుడే అనుకున్నాను. ఇంకా అది నా దగ్గర భద్రంగా ఉంది.

భోజనానంతరం తిరిగివస్తూ సీతయ్య రూంవైపు చూశాను. అదింకా తాళం వేసి ఉంది. ఆమె ఏదో సర్దుతూవున్న చప్పుడు విని ఒక క్షణం అలా నిలబడి గదిలోకి వెళ్ళి పడక కుర్చీలో కూర్చున్నాను. పన్నెండు దాటితేగాని ఆఫీసుకి వెళ్ళదలుచుకోలేదు. కిటికీలోంచి వీధి వైపు చూస్తూ కాలం గడపసాగాను. ఒక పావుగంట కాలం గడిచి ఉంటుంది. హోటల్ ముందు కారు ఒకటి ఆగింది. తలుపు తెరుచుకుని సీతయ్య బయటికి వచ్చాడు. కాసేపటికి నడవలో బూట్ల చప్పుడు వినిపించింది.

''మాలతిగారూ.''

అతని కేక వినిపించింది.

''రండి. కారు తెచ్చాను. మీకు టైం అవుతోంది.''

"కారా ?" ఆమె ఆశ్చర్యంగా అడిగింది.

''అవును. హైద్రాబాద్ వస్తే నాకు కారు లేకపోతే జరగదండీ. ఎక్కడికి వెళ్ళినా కార్లో వెళ్లాలిసిందే. పదండి. మిమ్మల్ని ఆఫీసులో విడిచిపెడతాను. సెక్రెటరీ చెవులో వేశాన్లెండి. దానికేం, చూద్దాం అన్నాడు. త్వరగా రండి మరి."

గుక్క తిప్పుకోకుండా, ఆమెని ఆలోచించనివ్వకుండా అతనలా మాట్లాడేస్తుంటే నిజానికి నాక్కూడా అతని తెగువకీ, చొరవకీ ఆశ్చర్యం వేసింది. తరవాత ఆమె కొంత తటపటాయించటమూ, అతను మరింత బలవంతం చేయటమూ లాంఛనప్రాయంగా జరిగాయి.

నేను కారువైపు అలా చూస్తూ ఉండగానే, ఇద్దరూ అందులో ఎక్కటమూ, కారు డవున్ రోడ్డుమీద జారిపోవటమూ జరిగాయి. నాకు మనసులో అసంతృప్తిగానే ఉంది. ఆమె ఏంచేస్తుంది పాపం. సీతయ్యలాంటి వ్యక్తుల్ని వదిలించుకోటం అంత సులభం కాదని తెలుస్తూనే ఉంది.

పన్నెండున్నరకి నేనూ సెక్రెటేరియట్ కి బయల్దేరాను. నా మిత్రుడు అసిస్టెంట్ సెక్రెటరీ ఒకాయన ఉంటే అతనితో ఆమె విషయం చెప్పాను. అతను తప్పక సహాయం చేస్తానని మాట ఇచ్చాడు. ఇదంతా ఒక గంటకంటె ఎక్కువ కాలం పట్టలేదు. పని కాగానే నేరుగా హోటల్ కి వచ్చేశాను. మంచం మీద నడుం వాల్చగానే నిద్ర పట్టిపోయింది. లేచేసరికి మూడు గంట లయింది. కాఫీ తాగాలని బోయ్ ని పిలిచాను. మళ్ళీ మనసు మార్చుకుని పక్క వేసుకొన్నాను. నాకు నలుగురిలో కూర్చుని కాఫీ తాగటమే సరదా. కిందికి వెడుతూ ఆమె రూం వైపు చూశాను. ఇంకా తాళం వేసే ఉంది. బహుశా ఇంటర్వ్యూ అయివుండదు. పదకొండింటికి రమ్మని ఏ మూడు గంటలకోగాని పిలవరు. మామూలే.

కాఫీ తాగుతున్నాను. హోటల్ ముందు కారాగింది. ఇద్దరు వ్యక్తులు లోపలికి వచ్చి మెట్లవైపు వెడుతున్నారు. ఒకడు సీతయ్య, రెండో వ్యక్తి పొడుగ్గా సన్నగా ఉన్నాడు. ఎర్రటి ఛాయ, దొర టోపీ, మంచి ఉద్యోగంలో ఉన్నట్టు స్ఫురింపచేసే నడక తీరు, ఖరీదైన దుస్తులు. మరి మాలతి ఏమైనట్టు? ఆమెని అక్కడే వదిలి సీతయ్య తన పనిమీద తిరుగుతూ ఉండిఉంటాడు. లేక ఆమె తరవాత వస్తానని చెప్పిఉండాలి. ఆమె ఉద్యోగం ఏమైందో! నేను మిత్రుడితో ఆమె విషయం చెప్పాను. అతను ప్రయత్నిస్తానని మాటకూడా ఇచ్చాడు. నా సిఫారసువల్ల ఉద్యోగం వచ్చినా, ఆమె సీతయ్యే తనకి ఉద్యోగం ఇప్పించాడని అనుకోవచ్చు.

ఆలోచిస్తూ కాఫీ తాగడం పూర్తి చేసి మేడమీదికి వచ్చాను. సీతయ్య గది మీదుగా వస్తుంటే మాటలు వినిపించాయి. యాథాలాపంగా గదిలోకి చూశాను. సీతయ్య నిలబడి ఉన్నాడు. ఆ వ్యక్తి కుర్చీలో కూర్చుని తాపీగా సిగరెట్ తాగుతున్నాడు.

"తమరిలా వస్తారని తెలిస్తే కారు పంపేవాడిని" అంటున్నాడు సీతయ్య.

"నేనూ ముందు అనుకోలేదు" అని అతనన్నాడు.

తరవాత వాళ్ళేం మాట్లాడారో నేను వినలేదు. సరాసరి నా గదికి వచ్చేశాను. బజార్లో కొన్న పత్రికలు తిరగేస్తూ అలా ఎంతసేపు గడిపానో, వీధిలో కారు బర్రున హోటల్ముందు స్టార్టయిన శబ్దం విని అటువైపు చూశాను. సీతయ్యా, ఆ వ్యక్తీ కారులో వెడుతున్నారు. అంత పరామర్శించినవాడు, నన్ను చూసి కూడా నా వ్యవహారం విషయం అడగనే లేదు. అయితే సీతయ్య అడుగుతాడనీ నేననుకోలేదు.

సాయంకాలం నాలుగు గంటలకి ఆమె వచ్చింది. కిటికీలోంచి ఆ తలుపువైపు చూస్తూ కూర్చున్నాను. ఫలితం ఏమైందో అడుగుదా మనుకున్నాను. కాని ఒకవేళ అనుకూలంగా లేకపోతే ఆమెకి విసుగు పుట్టించినవాడి నౌతానేమో నని మానుకున్నాను. ఏదో నవల తిరగేస్తూ కూర్చున్నాను. చదవటం విసుగనిపించింది. అయిదు దాటింది. అలా కాసేపు బయట తిరిగి మొదటి ఆట సినిమాకి వెళ్ళి వద్దామని లేచాను. ముఖం కడుక్కుని దుస్తులు మార్చుకుని గది బయటికి వచ్చాను. ఆమె గదితలుపులు ఓరగా తెరిచి ఉన్నాయి. ఆమె కుర్చీలో కూర్చొని ఆలోచిస్తూంది. ముఖం చూస్తే బాగా అలిసిపోయినట్టు కనిపించింది.

"ఏమండీ, ఉద్యోగం ఏమైంది?"

ఆమె ఉలిక్కిపడి లేచి నుంచుంది.

"కావొచ్చుండీ, థాంక్స్" అంది.

"వెరీగుడ్" అనేసి బయటికి వెళ్ళాను. మనసు కొంత తేలికపడ్డది. పాపం, ఎంతో అవసరం ఉండి ఉద్యోగానికి దరఖాస్తు పెట్టిందేమో. దుస్తులు చూస్తే ఖరీదైనవిగానే ఉన్నాయి. కాని అవసరాలన్నీ, దుస్తుల్నిబట్టి లెక్కకట్టటానికి వీల్లేదు. ఉద్యోగం వస్తే ఆమె చిక్కులన్నీ తీరిపోవచ్చు.

సాయంకాలం ఎలాగో గడిపి ఏదో పిక్చరుకి వెళ్ళాను. హోటల్కి వచ్చి, భోజనం చేసి, మేడమీదికి వచ్చే సరికి పది ఐంది. సీతయ్య గూం తాళం వేసి ఉంది. అప్పటినించీ రాలేదేమో. అతనికి తిరగటానికి ఒక స్థలమైతే గద! ఆఫీసులూ, క్లబ్బులూ, ఆఫీసర్ల ఇళ్ళూ చుట్ట పెట్టాలి. పైగా ఎవరో గెస్టుకుండా దొరికినట్టున్నాడు. పదకొండో నెంబరు గదిలో బెడ్లైట్ వెలుగుతోంది. కిటికీలోంచి చూశాను. ఆమె కుర్చీలో కూర్చునే ఉంది. జీవితపు సమస్యలు నిద్రపోనివ్వటం లేదు కాబోలు.

గదిలోకి వచ్చాను. నిద్రవచ్చే సూచన ఏమీలేదు. ఒక్కొక్క పుస్తకమూ పేజీలు తిరగేస్తూ కూర్చున్నాను. పదకొండయింది. లైటు ఆర్పేసి పడుకున్నాను. దోమలు నిద్ర పోనిచ్చేట్టు లేవు. పంకా దారిన పంకా తిరుగుతూనే ఉంది. కొత్త స్థలంలో నాకు త్వరగా నిద్ర పట్టదు. మర్నాడు ఆర్డర్సు రావచ్చు. వస్తే తీసుకుని ఇంటిముఖం పట్టవచ్చు. మనసులో ఏమేమిటో ఆలోచనలు ముసురుకోసాగాయి.

ఆలోచనలకి తటాలున అంతరాయం కలిగింది. ఎవరో తలుపు తడుతున్నారు. ఇంత రాత్రివేళ నన్నెవరు పిలుస్తారు. చెవులు నిక్కించి విన్నాను. ఉఁహుఁ. నా గది కాదు. పదకొండో నెంబరు గది. ఈ విషయం తెలియగానే చప్పున లేచి కూర్చున్నాను.

తలుపు చప్పుడు మరింత స్పష్టమైంది.

"ఎవరు?" ఆమె స్వరం వినిపించింది.

కుతూహలం కొద్దీ కిటికీలోంచి చూశాను. నడవలో లైట్లు లేవు. లీలగా తలుపుదగ్గర ఇద్దరు వ్యక్తులు కనిపించారు.

"ఒకసారి తలుపు తెరవండి." కంట్రాక్టరు సీతయ్య స్వరం. ఆరి పీడిదుంపతెగ!

ఆమె సమాధానం ఇవ్వలేదు.

"నేనండీ సీతయ్యని. ఒక్కసారి తలుపు తియ్యండి. ఒక ముఖ్యమైన మాట చెప్పిపోతాను."

తలుపు కిర్రుమంది.

ఒక విగ్రహం వెంటనే దూరంగా తొలగిపోవటం కిటికీలోంచి స్పష్టంగా చూశాను. తరవాత అస్పష్టంగా మాటలు వినిపించాయి.

"ఎంజోయ్....డార్లింగ్....హా.హా... కమ్....కమ్...." ఎవడో తాగుబోతు.

ఆ తరవాత ఒక్క క్షణం నిశ్శబ్దం. ఆ వెంటనే నిశ్శబ్దాన్ని బాకుతో పొడిచినట్టుగా ఒక్క పొలికేక. ఆర్తనాదమే

అయినా వయొలిన్ సన్నని తీగమీద కమాను జర్రున లాగినట్టు వినిపించి తటాలున లేచి తలుపు తెరిచి ఒక్క దూకులో ఆమె గదివాకిట పడ్డాను. పడీ పడటంతో ఒక చెయ్యి ఆ వ్యక్తి మెడనీ, రెండో చెయ్యి అతని బుజాల్ని చుట్టేశాయి.

"రాస్కెల్ ! ఎవడ్రా నువ్వు. తాగి వచ్చి పేలతావా !''

ఉద్రేకంలో అతని చెంపలు ఫెడీఫెడీ వాయించాను. అతను తట్టుకోలేక తూలి కింద పడ్డాడు. ఇంతలో ఆమె స్విచ్ వేసింది. బోర్లాపడ్డ ఆ వ్యక్తిని సరిగా నిలబెట్టి ఒక తోపు తోసి ''గెటవుట్'' అన్నాను. ఆమె వొణికిపోతూ వుంది. అతనేదో గొణుక్కున్నాడు.

''స్కౌండ్రల్ గొణుగుతావా ! ఆమె కాళ్లమీద పడు."

అతని షర్టు కాలర్ పట్టుకున్నాను. ముఖంలోకి చూసి అదిరిపడ్డాను. అతను సాయంకాలం సీతయ్యతో వచ్చిన వ్యక్తే. సందేహం లేదు. సీతయ్యని ముక్కలుగా నరికినా పాపం లేదనిపించింది. కాలర్



ఒక్క ఊపు ఊపి ఆమె కాళ్లమీద పడేశాను.

ఆమె ఒక్కసారి కెవ్వుమంది.

భయపడ్డది పాపం, అనుకుని అతన్ని సీతయ్య రూంలోకి లాక్కెళ్ళి లోపలికి తోశాను. గదిలో సీతయ్య లేడు. ఉడాయించేశాడు. గది తలుపు గొళ్ళెం పెట్టాను. అందరూ గాఢ నిద్రలో ఉన్నట్టున్నారు. లాడ్జర్సు ఎవరూ బయటికి రాలేదు. ఆమె గది దగ్గిరికి వచ్చేసరికి వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"తాగుబోతు వెధవ. రేపొద్దున పోలీసువాళ్లకి వప్పచెప్తాను. ఆ రోగం కుదుర్తుంది."

ఆమె బరువుగా తలెత్తి దీనంగా చూసింది. కళ్లు తుడుచుకుంది.

"కృతజ్ఞురాలినండీ." హీన స్వరంతో అంది.

"అదృష్టం బాగుంది. నాకు నిద్ర పట్టలేదు. మీరు బాగా భయపడిపోయారు. జీవితంలో ఇలా హఠాత్తుగా అనుకోని సంఘటన ఒకటి జరిగితే మహా మహావాళ్లే చెదిరిపోతా రనుకోండి ..."

"ఇది మొదటిసారి కాదండీ."

భగ్నవీణలా మోగింది ఆమె స్వరం.

నాకు కొంచెం ఆశ్చర్యం కలిగింది.

"మొదటిసారి కాదా?"

"ఉహుఁ. సరిగా రెండు సంవత్సరాల క్రితం-ఇలాంటి ఒక చీకటిరాత్రి-ఇలాగే జరిగింది."

"ఇతనేనా?" విస్మయంతో అడిగాను.

"కాదు కాదు. ఆ రాత్రి ఎన్నటికీ మర్చిపోలేను. ఈ రాత్రి కూడా. అప్పుడూ ఇలాగే ఇంటర్వ్యూకి వచ్చాను. ఇదే హోటల్లో దిగాను."

"ఇలా ఒంటరిగా రావటం మంచిది కాదండీ."

"ఏం చెయ్యను?"

"మీ కెవరూ లేరా?"

"ఉన్నారు."

"మీకు వివాహం అయిందా?"

ఆమె నావైపొకసారి చూసి తల ఆడించి వేలి ఉంగరం చూసుకుంది.

"మరి మీ భర్త?"

"ఆయనకి నేను ఉద్యోగం చేయటం ఇష్టంలేదు."

"మరి మీ రాకకి—"

"కారణం ఉంది. మొదటిసారి ఇంటర్వ్యూకి వచ్చినప్పుడు నేను అవివాహితని. స్కూలు ఫైనల్ ప్యాసయి, టైపురైటింగ్, షార్టుహాండ్ నేర్చుకున్నాను. ఉద్యోగం అవసరం కొద్దీ చెయ్యాలని నిశ్చయించుకున్నాను. కాని వివాహమైనతర్వాత అవసరం లేక పోయింది. మావారు శ్రీమంతులు. ఈ రెండు సంవత్సరాల్లో చాలా మార్పులు వచ్చాయి."

"అంటే ఆస్తి దావాల్లోగాని పోయిందంటారా?"

"పోయినా ఇబ్బంది ఉండేదికాదు. ఆయన గెజిటెడ్ ఉద్యోగి. కాని మాకు అభిప్రాయభేదం కలిగింది. స్వతంత్రంగా బ్రతకదల్చుకున్నాను."

"తొందర పడుతున్నారు."

ఆమెకి అకస్మాత్తుగా కన్నీళ్ళు జలజల రాలాయి.

"నేనూ అలా అనుకోక పోలేదు. కాని .... కాని .... నేను తొందరపడలేదండీ." ఆమె బల్లమీద తలపెట్టుకుని శూన్యదృక్కులతో వేలి ఉంగరం చూసుకుంది.

"మీ ఆంతరంగిక విషయాలు నాకు తెలియవు. కాని ఇంటికి వెళ్ళిపొండని సలహా ఇస్తున్నాను."

ఆమె మాట్లాటలేదు. మళ్ళీ హెచ్చరించాను. ఆమె ఏదో ఆలోచిస్తూ నా వైపు చూసింది.

"ఏమిటి అంటున్నారు? హీరోనీ విలన్నీ ఒక్కవిధంగానే చూడగలరా ఎవరైనా?"

నాకు షాక్ తగిలినట్టయింది. ఆమె అభిప్రాయ మేమిటో నాకు తెలియదు. అడగటానికి సాహసించలేదు. ఆమె గాద్గదికంగా అంది,

"వొద్దు, వొద్దు, నేను అన్నీ పోగొట్టుకొన్నాను. ఇంక నేను ఆశించే దేమీ లేదు. ప్చ్!"

"అలా దిగులుపడకండి. ఇంక నిద్రపొండి. చాలా పొద్దుపోయింది."

ఆమెకి దుఃఖం మరింత పొంగిపొర్లింది. చేసే దేమీలేక నేను నా గదికి వచ్చేశాను.

ఆ రాత్రి నాకు సరిగా నిద్ర పట్టనే లేదు. ఆ వ్యక్తి ఎవరో హోదా గలవాడనుకున్నాను. పరమ దౌర్భాగ్యుడిలా ఉన్నాడు. అతనిమీద నాకు పట్టరాని ఆగ్రహం కలిగింది. రాత్రంతా ఆమెని గురించే ఆలోచిస్తూ పడుకున్నాను. ఆమె భర్తకీ ఆమెకీ కలిగిన భేదాభిప్రాయ మేమిటో? ఆమె అంతగా విరక్తి చెందటానికి కారణం అంత బలవత్తరమైనదా! ఎంత ఆలోచించినా తేలే విషయం కాక పోవటంవల్ల విసుగు పుట్టింది. ఎప్పుడో తెల్లవారుజామున కునుకుపట్టింది.

నిద్ర లేచేసరికి బాగా తెల్లవారింది. సరాసరి సీతయ్య రూమ్‌కి వెళ్ళాను. వేసిన గొళ్ళెం అలాగే ఉంది. తీశాను. మంచంమీద వెల్లకిలా పడుకుని వున్న ఆ వ్యక్తిని చూడగానే రాత్రి జరిగిన సంఘటన కళ్ళలో మెదిలి వొళ్ళు మండిపోయింది.

"ఏం వొళ్ళు తెలిసిందా?" అన్నాను కోపంగా.

అతను చప్పున లేచి కూర్చున్నాడు.

"చూస్తే అయినింట్లోపుట్టినట్టున్నావు. చదువుకున్నట్టుకూడా కనిపిస్తున్నావు. రాత్రిళ్ళు తప్పతాగి తలుపులు తట్టటానికి సిగ్గు వెయ్యదూ? ఛీ!" అన్నాను ఉద్రేకంగా.

అతని ముఖం చిన్నబోయింది. జరిగింది క్రమంగా గుర్తుకి తెచ్చుకుంటున్నాడు కాబోలు.

"క్షమించండి. ఆ సీతయ్య ఇక్కడ కూడా తారసపడతా డనుకోలేదు. మన బంగారం మంచిదయితే - అంటారు. అంతేనా? కాని బలహీనమైన మొక్కని ఒంచితే అది ఒంగి పోతుంది. అలా కాక దానికి ఆసరా ఇచ్చి ఆదుకుంటే బలమైన వృక్షం ఔతుంది. ఆకర్షణల్ని ఉసిగొల్పి మనసుని పల్టీకొట్టిస్తే నే నేంచెయ్యను?"

అత నేదో ధర్మపన్నాలు వల్లిస్తున్నట్టు తోచి నాకు మరింత ఆవేశం కలిగింది.

"చాల్లేవయ్యా; చేసిన పనికి సిగ్గుపడక, తగుదునమ్మా అని డిఫెన్స్ ఆర్గ్యుమెంట్లు చెప్తున్నావు. పోలీసు స్టేషన్‌కి పంపిస్తే ఈపాటికి ఆత్మహత్య చేసుకునే వాడివి, మానాభి మానా లుంటే."

అతని ముఖం ఎర్రబడ్డది.

"డిఫెండ్ చేసుకోవటం లేదండీ," అన్నా డతను కుంగిపోయి.

"పెద్దమనిషి వైతే ఇక లేచి ఆమె రెండు కాళ్లూ పట్టుకుని క్షమాపణ కోరుకో. పేరూ ఊరూ ఉంటే చెప్పి లెంప లేసుకో."

"నా పేరు మాధవరావండీ.పి.డబ్ల్యు డి. అసిస్టెంట్ ఇంజనీర్ని" అన్నాడు అతను విషాదంగా.

నేను స్తబ్ధుడి నయాను.

"అయాం సారీ-కాని మీ హోదాకి తగిన పని కాదండీ మీరు చేసింది" అన్నాను నా ధోరణిని సమర్థించుకుంటూ.

"హోదాకి తగిన పనంటూ ఏమీ లేదండీ. మానవత్వానికి భిన్నంగా ప్రవర్తించాను. కాని నా విషాదం అది కాదు. మీరేవో మాటలు అన్నారు. అందుకు కూడా నాకు విచారం లేదు. ఎందుకంటే ఆమాట లన్నీ ఒకప్పుడు నేనూ అన్నాను. అవును. నేనూ ఒకప్పుడు హీరోనే-సరిగా రెండు సంవత్సరాల క్రితం-ఒక చీకటి రాత్రి ఇదే హోటల్లో. ఆ ఘటన ఒక సుఖ స్వప్నానికి నాంది. ఆ స్వప్నం నిజమైంది. కాని నా దౌర్భాగ్యంకొద్దీ తరవాత ఆమె జీవితాన్ని స్వప్నం చేశాను. ఇప్పుడా స్వప్నాన్ని కూడా భగ్నం చేశాను. అది తునాతునకలై పోయింది. మాస్టారూ, ఇక నా మాలతి ముఖం చూడలేను. దయచేసి ఆమెకు నా క్షమాపణలు అందచేస్తారు కదూ."

నే నేం వింటున్నానో నాకే తెలియ లేదు. నాకు తెలివి వచ్చేసరికి అతను గబగబ మెట్లు దిగి వెళ్ళిపోతున్నాడు. త్వరగా మెట్లదగ్గిరికి వచ్చాను. అత నో టాక్సీలో ఎక్కాడు. అది జనంలోకి దూసుకుపోయింది.

